30 కాలనీలు.. 40 ఫీట్ల రోడ్డు

- ఇరుకు రోడ్లలోనే ప్రయాణం
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు, స్థానికులు
- అత్యవసర సమయాల్లో అంబులెన్స్, ఫైరింజన్లకు తప్పని తిప్పలు
- రద్దీ సమయాల్లో నిలుస్తున్న ట్రాఫిక్
- హైటెక్ సిటీకి చేరువలో ఉన్నా అభివృద్ధికి నోచుకోని అల్లాపూర్

అల్లాపూర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరంలోనే అత్యధిక జన సాంద్రత కలిగిన ప్రాంతాల్లో అల్లాపూర్ డివిజన్ కూడా ఒకటి. దాదాపు 30 కాలనీలు ఉన్న అల్లాపూర్ డివిజన్‌కు సరైన రోడ్డు లేక కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు 100 ఫీట్ల రోడ్డు ఉండాలి. హైటెక్ సిటీకి అతి చేరువలో ఉన్న ప్రాంతమే అయినా, ప్రజా రవాణా, సంబంధిత సౌకర్యాల్లో మాత్రం వెనుకబడిందనే చెప్పాలి. లక్షలు, కోట్లు వెచ్చించి ఇళ్ల కొనుగోలు చేశాక కనీసం ఓ మోస్తారు రోడ్డు లేకపోవడం బాధాకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అల్లాపూర్ పరిసర కాలనీల్లో పాట్ల ధరలు, ఇళ్ల అద్దెలు బాగానే ఉంటాయి. ఐటీ ఉద్యోగులు ఇక్కడ ఉండేందుకు ఎక్కువగా ఇష్టపడుతుంటారు. అల్లాపూర్‌లో 'రియల్' ఆస్తుల విలువలో మాత్రం వెనకబడడానికి సరైన రోడ్డు లేకపోవడం ప్రధాన కారణం.



రోడ్డుకు అడ్డంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, నిలిచిన ఆర్టీసీ బస్సు, వాహనాలు

ట్రాఫిక్ సమస్యకు కారణం

40 ఫీట్ల వెడల్పుతో ఉన్న రహదారికి ఇరువైపులా విద్యుత్ స్తంభాలు, సీసీటీవీ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఉండడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. వాటిని తొలగించి లేదా పక్కకు జరిపితే తప్ప ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ఆర్టీసీ బస్సులు కూడా సునాయసంగా తిరుగుతాయి.

రోడ్డు వెడల్పునకు తొమ్మిదేళ్లుగా హడావిడి

అల్లాపూర్ ప్రధాన రహదారిని విస్తరిస్తామంటూ గతంలో మార్కింగ్ చేశారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న వాణిజ్య భవనాలు, గృహ సముదాయాల వారు కలవరానికి గురయ్యా రు. తొమ్మిదేళ్ల దీర్ఘకాలం గడిచినా ఇప్పటి వరకు రోడ్డు వెడ ల్పు ఊసే లేదు. అధికారులు మాత్రం ఎప్పటికప్పుడు అంశం పరిశీలన దశలో ఉందంటూ చేతులు దులుపుకొంటున్నారు.



అల్లాపూర్ నాలాపై ట్రాఫిక్ జామ్



బోరబండ ఎంఎంటీస్ స్టేషన్‌లో సరిపడా స్థలం ఉన్నా, పంఖా వద్ద టర్మినల్‌లో నిలిచిన బస్సులు

నామ మాత్రంగా బస్సులు

సరైన రహదారి లేకపోవడంతో అల్లాపూర్ ప్రాంతానికి ఆర్టీసీ బసుల సౌకర్యం అంతమాత్రమే. మోతీనగర్, మాదాపూర్, హైటెక్ సిటీకి.. ఇలా ఏవైపు వెళ్లాలన్నా సొంత వాహనాలు లేదా ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. హైటెక్ సిటీలోని కంపెనీల్లో హౌజ్ కీపింగ్, సెక్యూరిటీ గార్డ్ వంటి చిరుద్యోగులకు రిస్క్‌తో కూడిన షేరింగ్ ఆటోల్లో ప్రయాణించాల్సి వస్తోంది. ఇక్కడ బస్సుల సంఖ్య పెరగాలన్నా, రవాణా సమస్యలు తీరాలన్నా మోతీనగర్ నుంచి హైటెక్ సిటీ వరకు కనీసం 100 అడుగుల వెడల్పు రహదారి నిర్మాణం చేపట్టాలని అల్లాపూర్ పరిసర కాలనీలవాసులు కోరుతున్నారు. రోడ్డు సరిగ్గా లేనందున, బోరబండలో ట్రాఫిక్ రద్దీ తగ్గేలా ఎంఎంటీఎస్ స్టేషన్ ఆవరణలో దశాబ్దం క్రితం ఏర్పాటు చేసిన విశాల ప్రాంగణం వరకు బసులు నడపకుండా పంఖా వద్దనే టర్మినేట్ చేస్తున్నారు.

అరకొరగా ప్రజా రవాణా



మా అబ్బాయి ఎస్సార్ నగర్‌లోని కాలేజీలో ఇంటర్ చదువుతున్నాడు. సమయానికి బస్సులు లేక బోరబండ వరకు షేరింగ్ ఆటోలో వెళ్లి అక్కడి నుంచి బస్సు ఎక్కుతాడు. బస్‌పాసులు ఉండి కూడా ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితి. బసుల లేమికి రోడ్డు విస్తరణలో జాప్యమే కారణం.

- పండరి, విద్యార్థి తండ్రి, తులసీనగర్

అల్లాపూర్‌కు రోడ్డు వేయాలి



అభివృద్ధి చెందిన గాయత్రీనగర్‌లో కూడా సరైన రోడ్డు లేదు. ఇరుకు రోడ్డు, యథేచ్ఛగా వాహనాల పార్కింగ్‌తో ఇబ్బందులు పడుతున్నాం. మాదాపూర్, మోతీనగర్ నుంచి అల్లాపూర్‌కు రోడ్డు వేయాలి. అత్యవసరంగా అంబులెన్స్, ఫైరింజన్లు రావడానికి ఇబ్బందిగా ఉంటుంది. అల్లాపూర్‌కు రోడ్డు తప్పనిసరి వేయాలి.

- కేడీపీ మూర్తి, కంపెనీ సెక్రెటరీ, గాయత్రీనగర్

స్కూల్ బస్సులు రావడం లేదు

మా ఇద్దరు అమ్మాయిలు జూబ్లీహిల్స్‌లోని భవన్స్ స్కూల్‌లో చదువుతున్నారు. స్కూల్ బస్సులు మోతీనగర్ వరకే ఉన్నాయి. ఒక బస్సుకు సరిపడా పిల్లలు ఉన్నా, సరైన రోడ్డు లేకపోవడంతో స్కూల్ వాళ్లు ఇక్కడి నుంచి బస్సులు నడపడం లేదు. ఇబ్బంది పడాల్సివస్తోంది.

- శిరీష, గృహిణి, తులసీ నగర్

రోడ్డు కుచించుకుపోయింది



ఇరుకు రోడ్డు ఆపై ఆక్రమణలు, రోడ్డుపైనే పార్కింగ్‌ల కారణంగా బస్సులు సులువుగా నడపలేక డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నారు. అల్లాపూర్ ప్రధాన రహదారిలో షెడ్లు, అక్రమ పార్కింగ్‌ల కారణంగా ఉన్నరోడ్డు కుచించుకుపోయింది. రోడ్డు వెడల్పుగా ఉంటే బసుల సంఖ్యను పెంచవచ్చు.

- డి.హరి, టీజీఎస్ ఆర్టీసీ డీపో మేనేజర్, కూకట్‌పల్లి

హీరాచంద్‌కు నివాళి



సేట్‌వాల్‌చంద్ హీరాచంద్‌కు నివాళులర్పిస్తున్న హెచ్ఏఎల్ ఉద్యోగులు

బాలానగర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): బాలానగర్‌లో హిందుస్థాన్ ఏరోనాటికల్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్) పరిశ్రమ వ్యవస్థాపకుడు సేట్‌వాల్ చంద్ హీరాచంద్ జయంతి సందర్భంగా కార్మిక యూనియన్ నాయకులు, కార్మికులు హెచ్ఏఎల్ సౌత్ గేటు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఏడబ్ల్యూ యూనియన్ గౌరవ అధ్యక్షుడు విజయప్రసాద్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ అన్వర్, కర్కనాగరాజు, చందర్‌రావు నాయక్, సబ్గతుల్లా, బాబీ, మంజుల, అశోక్, జనార్దన్, వెంకటేశ్, ఆంజనేయులు, అజయ్, రవి మల్లేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

జలమండలి 'ఓటీఎస్'కు స్పందన



శ్రీవివేకానందనగర్‌లో ఓ ఇంటి వద్ద బిల్లు వసూలు చేస్తున్న వాటర్‌వర్క్స్ మేనేజర్ అన్వేత్ కుమార్, సహచరులు

అల్లాపూర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అండ్ సీవరేజ్ బోర్డు ప్రవేశపెట్టిన 'ఒన్ టైం సెటిల్ మెంట్' పాత బకాయిల చెల్లింపు పథకానికి స్పందన లభిస్తోందని, వినియోగదారులు అవగాహనతో ముందుకొస్తున్నారని జలమండలి గాయత్రీనగర్ సెక్షన్ మేనేజర్ అన్వేత్ కుమార్ తెలిపారు. నెలాఖరులోపు పెండింగ్ బిల్లులు చెల్లించుకునే వినియోగదారులకు లేట్-ఫీ-చార్జీలతో పాటు అరియర్స్ మొత్తంపైన వేసే వడ్డీపై మినహాయింపు ఉంటుందని, నవంబరు 30వరకు అమలులో ఉంటుందని అధికారి తెలిపారు.

డొక్కా సీతమ్మ పేరుతో అన్న సమారాధన



అన్నం వడ్డిస్తున్న ప్రేమకుమార్

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కరోనా నుంచి కేపీహెచ్‌బీ తొమ్మిదోఫేజ్ ఆటోస్టాండ్ వద్ద ప్రతి శనివారం జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పిలుపు మేరకు డొక్కా సీతమ్మ పేరుతో జనసైనికుడు మహేష్ అన్న సమారాధన చేస్తున్నాడు. ఈ సందర్భంగా ఆ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ హాజరై మహేష్ సేవలను అభినందిస్తూ పలువురికి అన్నం వడ్డించారు. కార్యక్రమంలో కొల్లా శంకర్, కలిగినీడి ప్రసాద్, గడ్డం వీర, పసుపులేటి ప్రసాద్, అంజి, శిరీష, రమేష్, శంకర్‌రావు, చాంద్ పాషా, రామకృష్ణ, సాయిరాం చౌదరి, వంశీ, బాలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత వీధి నాటకం



జేఎన్‌టీయూ చౌరస్తాలో రోడ్డు ప్రమాదాల నివారణ గురించి సడక్ పే సురక్షా-హమారి సురక్షా పేరుతో మెరిడియన్ స్కూల్ విద్యార్థులు, టీచర్స్ శనివారం వీధి నాటకం ప్రదర్శించారు. ట్రాఫిక్ నియమాలు, సీటు బెల్టు, హెల్మెట్ ధరించడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ల వాడకాన్ని నివారించడం, వేగ పరిమితుల గురించి వాహనదారులకు అవగాహన కల్పించారు.

- కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి)

'ఎనుముల అంటే.. అష్యూరెన్సు!'

హైదరాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అధికారం కోల్పోయిన అసహనంలో సీఎం రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు ఏదేదో మాట్లాడుతున్నారని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి అన్నారు. ఎనుముల అంటే అష్యూరెన్సు అని, భట్టి అంటే బ్రాండ్ అని ఆయన గుర్తు పెట్టుకోవాలన్నారు. ఎనుముల రేవంత్‌రెడ్డి అంటే.. ఎగవేతల రేవంత్‌రెడ్డి అంటూ ఖమ్మంలో హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై ఈ మేరకు స్పందించారు. గాంధీ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కన్నా ఇప్పటికే 3 లక్షల టన్నులు అదనంగా పత్తి కొనుగోళ్లు జరిగాయని, 12 శాతం తేమ ఉన్నా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. సన్నరకం ధాన్యానికి వారం రోజులుగా బోనస్ పడుతున్నా.. పడట్లేదంటూ హరీశ్‌రావు అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కృషి వల్లనే మత్స్యశాఖకు ఇన్‌ల్యాండ్ ఫిష్ స్టేట్ అవార్డు వచ్చిందని ఫిషర్మెన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు సాయికుమార్ అన్నారు.

పెద్దపిల్లల్ని దత్తత తీసుకునేందుకు ముందుకు రావాలి: కారా సీఈవో

యూసుఫ్‌గూడ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పిల్లల్ని పెంచుకోవాలనుకునే తల్లిదండ్రులు చిన్న పిల్లల్నే కాకుండా పెద్దపిల్లలను కూడా చట్టబద్ధమైన విధంగా దత్తత తీసుకునేందుకు ముందుకు రావాలని సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ(సీఏఆర్ఏ) సీఈఓ బావనా సక్సేనా అన్నారు. శనివారం యూసుఫ్‌గూడ నిమ్స్‌మే ఆడిటోరియంలో తెలంగాణ ప్రభుత్వ ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ దత్తత మాసం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 'పెద్ద వయసు పిల్లల దత్తత' అనే అంశంపై ఆమె మాట్లాడారు. పిల్లల్ని పెంచుకోవాలనే తల్లిదండ్రుల్లో 95శాతం మంది 0-6 సంవత్సరాల లోపు చిన్నారులను దత్తత తీసుకునేందుకు ఇష్ట పడుతున్నారన్నారు. కానీ 6 నుంచి 13 సంవత్సరాలు, 13 నుంచి 19సంవత్సరాల వారిని కూడా దత్తత తీసుకునే విధంగా అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. రీజినల్ పాస్‌పోర్ట్ ఆఫీసర్ స్నేహజ జోన్నలగడ్డ మాట్లాడుతూ... వేరే పిల్లల్ని దత్తత తీసుకుని పెంచటం అనేది ఎంతో ఉత్తమమైన కార్యక్రమం అన్నారు. దత్తత కోసం విదేశాల నుంచి కూడా ఎందరో వస్తున్నారని, అలాంటి సందర్భాల్లో పిల్లలకు పాస్‌పోర్ట్ అవసరం ఉంటుందని, వారికి వెంటనే పాస్‌పోర్ట్ ఇచ్చేందుకు మేము సిద్ధంగా ఉన్నామని ఆమె తెలిపారు. ఈసందర్భంగా 'పెద్ద వయసు పిల్లల దత్తత' పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. అనంతరం చిన్నారులు నృత్యాలు ప్రదర్శించారు. ప్రభుత్వ కార్యదర్శి అనిత రామచంద్రన్, డైరెక్టర్ ఆఫ్ ఉమెన్ డెవలప్, చైల్డ్ వెల్ఫేర్ కాంతివెస్లీ, ఎస్‌సీసీసీఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో ఫ్రెషర్స్ డే



నృత్యాలతో సందడి చేస్తున్న బీటెక్ ఫస్టియర్ విద్యార్థులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. హీరో పవన్‌కళ్యాణ్ నటించిన 'తమ్ముడు' చిత్రంలోని 'మేడిన్ ఆంధ్రా స్టూడెంట్ అంటే అర్థం వివరిస్తా' పాటకు విద్యార్థులు తమ స్టెప్పులతో అదరగొట్టారు. వర్సిటీలోని జేఎన్ ఆడిటోరియంలో బీటెక్ ఫస్టియర్ విద్యార్థులకు స్వాగతం పలుకుతూ సీనియర్ విద్యార్థులు ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి ఈ వేడుకలను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రెక్టార్ విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు కూడా ఎంతోకొంత స్వార్థం తప్పకుండా ఉండాలన్నారు. మా ఇల్లు, మా కాలేజీ, మా యూనివర్సిటీ అనే భావన కలిగి ఉండాలన్నారు. క్రమశిక్షణతో ఉంటూ కాలేజీ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో విద్యార్థుల సహకారం ఎంతో అవసరమన్నారు. యూనివర్సిటీలో చదువుతున్నపుడు బాధ్యతగా మెలిగితేనే భవిష్యత్తు బంగారుమయం అవుతుందన్నారు. మొదటి సంవత్సరంలో చేరిన 1,260 మంది విద్యార్థులు మంచి నడవడితో యూనివర్సిటీకి పేరు తెచ్చేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. వర్సిటీలో ఉన్న వనరులను బాధ్యతగా వినియోగించుకుంటే, తర్వాత తరాల విద్యార్థులు కూడా ఉపయోగపడతాయని సూచించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. క్యాంపస్‌లోని కొన్ని విభాగాల్లో ఐఐటీల కంటే మెరుగైన మౌలిక సదుపాయాలు ఉన్నాయని, విద్యార్థులు వాటిని వినియోగించుకొని తమ కెరీర్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది 62శాతం మంది విద్యార్థులకు ప్లేస్ మెంట్స్ వచ్చాయని, సగటు వేతనం రూ.13లక్షలు కాగా, అత్యధిక వేతనం రూ. 52లక్షలు అందుకున్నారని చెప్పారు. అనంతరం విభాగాల వారీగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలతో జేఎన్ ఆడిటోరియం హోరెత్తింది. కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వరరెడ్డి, విభాగాల హెచ్ఓడీలు రాంజీ, సుప్రీతి, బాస్కర్, సత్యనారాయణ, రమేశ్‌చంద్ర, డీన్‌కుమార్, విద్యావతి, రజిని, విజయలక్ష్మి, అర్చనగిరి, శాంతిశ్రీ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

జార్ఖండ్‌లో కాంగ్రెస్ విజయం.. నేతల సంబరాలు



బాలానగర్ పార్టీ కార్యాలయం వద్ద బండి రమేష్‌కు స్వీట్లు తినిపిస్తున్న నేతలు

బాలానగర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జార్ఖండ్ రాష్ట్రంలో శనివారం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడంపై కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకొన్నారు. బాలానగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లక్ష్మయ్య, సంజీవ, తూముమనోజ్, రాజేందర్, శివచౌదరీ, అరుణ్, నయీమ్, నరేందర్, రమణ, బాలరాజు, సతీష్‌గౌడ్, మహిళా నాయకులు పాల్గొన్నారు.

'ప్రియాంకగాంధీ గెలుపు చరిత్రాత్మకం'

వాద్రా వాయినాడ్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ప్రియాంకగాంధీ గెలుపు చరిత్రాత్మకమని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఏ బ్లాకు ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రియాంక గాంధీ విజయం ఆమెపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని రుజువు చేస్తోందన్నారు.

ప్రియాంక చిత్ర పటానికి గాంధీభవన్‌లో క్షీరాభిషేకం

హైదరాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వయనాడ్ లోక్‌సభ ఉపఎన్నికలో ఏఐసీసీ ప్రధానకార్యదర్శి ప్రియాంకగాంధీ అత్యధిక మెజారిటీతో విజయం సాధించడంతో గాంధీభవన్‌లో శనివారం పార్టీ నేతలు సంబరాలు జరిపారు. పార్టీ సీనియర్ నేత వి.హన్మంతరావు ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా హన్మంతరావు మాట్లాడుతూ వయనాడ్‌లో 4 లక్షల మెజారిటీతో గెలిచిన ప్రియాంకగాంధీ.. ఇందిరాగాంధీ వారసురాలిగా చరిత్ర సృష్టించారన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా రాహుల్, ప్రియాంక తిరిగి.. కాంగ్రెస్ పార్టీని కేంద్రంలో అధికారంలోకి తీసుకువస్తారని ధీమా వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో గెలుపు మోదీ, అమిత్‌షాలది కాదని, అదానీ, అంబానీలదని అన్నారు.



● మహారాష్ట్రలో బీజేపీ ఘన విజయం సందర్భంగా వివేకానంద నగర్‌లోని స్వామి వివేకానంద కూడలిలో వేడుక జరుపుకుంటున్న ఆ పార్టీ శ్రేణులు. నార్లపురం శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుదర్శన్ ముదిరాజ్, వెంకటరామిరెడ్డి, మల్లేష్, మురళి, నాగరాజు పాల్గొన్నారు.

- అల్లాపూర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి)

విజ్ఞాన ప్రదర్శనలో చిన్నారుల ప్రతిభ



విజ్ఞాన ప్రదర్శనలో పాల్గొన్న బచ్‌పన్ స్కూల్ విద్యార్థులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): విజ్ఞాన ప్రదర్శనలో బచ్‌పన్ స్కూల్‌కు చెందిన చిన్నారులు ప్రతిభను కనబర్చారు. కూకట్‌పల్లి రామయ్యనగర్‌లోని 'బచ్‌పన్' కేపీహెచ్‌బీ పాఠశాలలో ఏర్పాటు చేసిన విజ్ఞాన ప్రదర్శనను శనివారం డైరెక్టర్ మురళీధర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ వేడుకల్లో విద్యార్థి, విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. సంస్కృతి, సంప్రదాయాలు, భగవద్గీత శ్లోకాలను క్రమం తప్పకుండా విద్యార్థులకు బోధిస్తున్నట్టు చెప్పారు. కంప్యూటర్స్, రోబోటిక్స్ గురించి విద్యార్థులకు వివరించడంతో పాటు ప్లాస్టిక్ వాడకం తగ్గించడంపై అవగాహన కలిగిస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయురాలు అల్లూరి లక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్లు మంజూరు చేయాలి



ఏఈ భీమయ్యకు వినతి పత్రం అందజేస్తున్న అమ్రేష్ రాజు

అల్లాపూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తర అల్లాపూర్‌లోని రాజీవ్ గాంధీనగర్, సఫ్దర్ నగర్‌లలో కొన్ని నెలలుగా విద్యుత్ మీటర్లు మంజూరు చేయడంలేదని, దీంతో వినియోగదారులకు తీవ్రఇబ్బందులు ఎదురవుతున్నాయని బీజేపీ మేడ్చల్ జిల్లా అధికార ప్రతినిధి అమ్రేష్ రాజు పేర్కొన్నారు. ఈవిషయమై కాలనీల ప్రతినిధులతో కలిసి ఆయన బాలాజీనగర్ ఏఈ భీమయ్యను కలిసి విద్యుత్ మీటర్ల మంజూరును పునరుద్ధరించాలని కోరారు. ఒకే మీటరున్న ఇంటి యజమానులపై టెలిస్కోపిక్ బిల్లింగ్ పద్ధతిలో యూనిట్ రేటు అధికంగా ఉండడంతో ఆర్థిక భారమవుతోందని, వెంటనే కొత్త వారికి మీటర్లు మంజూరు చేయాల్సిందిగా అధికారికి విన్నవించగా ఏఈ భీమయ్య సానుకూలంగా స్పందించారు. ఈ భేటీలో ఆది, షకీల్, ఆరిఫ్, హైదర్, జమీల్, సునీల్, నవీన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అల్లం వెల్లుల్లి పేస్ట్ వ్యాపారిపై కేసు

హైదర్‌నగర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పాడైపోయిన అల్లం వెల్లుల్లి పేస్ట్ డబ్బాలు విక్రయిస్తున్న దుకాణదారుడిపై కేపీహెచ్‌బీ పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సురేందర్ అనే వ్యక్తి తహశీల్దార్ కార్యాలయం రోడ్డులోని శ్రీసిద్ధి వినాయక జనరల్ స్టోర్స్‌లో శుక్రవారం రాత్రి అల్లం వెల్లుల్లి పేస్ట్ డబ్బా కొనుగోలు చేసి, ఇంటికి వెళ్లి తెరిచి చూడగా అందులోని పేస్ట్ పాడైపోయి బూజుపట్టి దుర్వాసన వచ్చింది. షాప్ వద్దకు వెళ్లి దుకాణ యజమానిని ప్రశ్నించగా దురుసుగా సమాధానం చెప్పాడు. దీంతో కాలం చెల్లిన పదార్థాలను విక్రయించడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. సురేందర్ ఫిర్యాదు మేరకు జనరల్ స్టోర్స్ యజమాని ఓం ప్రకాష్‌పై కేసు నమోదు చేసిన కేపీహెచ్‌బీ పోలీసులు దుకాణంలో వివిధ సైజుల్లో డబ్బాల్లో ఉన్న 35కిలోల అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను సీజ్ చేసి మూసాపేట సర్కిల్ ఫుడ్‌సేఫ్టీ అధికారులకు విచారణ నిమిత్తం అందజేశారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న అల్లం వెల్లుల్లి పేస్ట్

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు



కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో కిలో కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. టమోట రూ.31, వంకాయ రూ. 40, బెండకాయ రూ.45, పచ్చి మిర్చి రూ.30, బజ్జి మిర్చి రూ.40, కాకరకాయ రూ.23, బీరకాయ రూ.38, క్యాబేజీ రూ.33, బీన్స్ రూ.45, క్యారెట్ రూ.55, గోబి పువ్వు రూ.23, దొండకాయ రూ.36, చిక్కుడు కాయ రూ.55, గోరు చిక్కుడు రూ.28, బీట్‌రూట్ రూ.50, క్యాప్సికం రూ.45, ఆలుగడ్డ రూ.35, కీర రూ.15, దోసకాయ రూ.23, సొరకాయ రూ.25, పొట్లకాయ రూ.28, కంద రూ.50, ఉల్లిపొరక రూ.45, ఉల్లిగడ్డ రూ.49, మామిడి కాయ రూ.15-20, అరటికాయ రూ.8-9, చామగడ్డ రూ.35, ముల్లంగి రూ.4-5, చిలగడ దుంప రూ. 35, గుమ్మడికాయ రూ.40, నిమ్మకాయలు రూ.50-60, మునగ కాయలు రూ.16-20, బొప్పాయి రూ.40, పుట్టగొడుగులు రూ.40, ఎండు మిర్చి రూ.220, అల్లం రూ.160, వెల్లుల్లి రూ.400, చింతపండు రూ.140, పండు మిర్చి రూ.80, ఉసిరి రూ.80, కరివేపాకు రూ.70, పర్వల్ రూ.45, పల్లికాయ రూ.70, లోబా రూ.45, ఆ కాకరకాయ రూ.100. పైన పేర్కొన్న ధరలు ఆదివారం ఉదయం 9.30 వరకు అందుబాటులో ఉంటాయి.

నేడు వనభోజనాలు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కమ్మ, కాపు, యాదవ సంఘం కార్తీక వనభోజనాలు ఆదివారం ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. బాలాజీనగర్ వినాయకుడి గుడి గ్రౌండ్‌లో కమ్మ సంఘం, కేపీహెచ్‌బీ భువన విజయం గ్రౌండ్‌లో కాపు సంఘం, మలేషియన్‌టౌన్‌షిప్ ఎదురుగా ఉన్న గోవర్ధనగిరి కొండపై యాదవం సంఘం వన భోజనాలు నిర్వహిస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు మధ్యాహ్నం కార్తీక భోజనాలు ఉంటాయన్నారు.





ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | హరిబాబు : 99854 11086



మహాపడిపూజలో పాల్గొన్న బీజేపీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ

రాయదుర్గం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో గోపన్‌పల్లిలోని రంగనాథస్వామి ఆలయంలో శనివారం అయ్యప్పస్వామి మహాపడిపూజ నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్, శేరిలింగంపల్లి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి రవికుమారయాద్ హాజరై అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప నామస్మరణలతో ఆలయం మార్మోగింది. స్వామివారికి విశిష్ట పూజలు, క్షీరాభిషేకం చేశారు. అనంతరం అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.



పైపులైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మాధవరం రోజాదేవి

సివరేజీ పైపులైన్ పనుల పరిశీలన

హైదర్‌నగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ డివిజన్ వెంకటేశ్వరనగర్ రోడ్ నంబర్-14లో జరుగుతున్న సివరేజీ పైపులైను పనులను శనివారం కార్పొరేటర్ మాధవరం రోజాదేవి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ త్వరలోనే రోడ్ నంబర్ 13, 14, 21 లో సీసీ రోడ్డు పనులను కూడా ప్రారంభించి వేగంగా పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసువస్తామన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు ఏఈ శ్రావణి, హెచ్‌ఎండబ్ల్యుఎస్ అండ్ ఎస్‌బీ మేనేజర్ ప్రియాంక, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, లింగయ్య, సోమయ్య, నర్సింలు, రమేష్‌రావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



రోడ్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

● కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

హైదర్‌నగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నామని ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ ఫేజ్-2 జీఎస్‌ఆర్ నగర్‌లో సీసీ రోడ్ల పనులు ప్రారంభించడానికి జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఆయన రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కాలనీలో రోడ్లు, వీధి దీపాలు, డ్రైనేజీ, తాగునీరు వంటి సదుపాయాలు అందించామని, ఇంకా మిగిలిన రోడ్లను ఇప్పుడు వేయడం జరుగుతుందన్నారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, అనిల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాగేష్‌గౌడ్, సాయి ప్రభాకర్, సాదిక్, రవీందర్, శ్రీధర్, నవీన్, ఏఈ రాజీవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న జగదీశ్వర్‌గౌడ్

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

మియాపూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి బాధితులకు అండగా నిలుస్తుందని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. నియోజకవర్గానికి చెందిన ఆరుగురికి మంజూరైన రూ.3.60 లక్షల చెక్కులను లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు ఆయన శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హైదర్‌నగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నానక్‌రాంగూడకు చెందిన చోటు సింగ్ వైద్య చికిత్స ఖర్చుల కోసం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నాడు. ఆయనకు మంజూరైన రూ.24 వేల చెక్కును లబ్ధిదారుడి కుటుంబ సభ్యులకు శనివారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అందజేశారు.



సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

సీసీ రోడ్డు పనుల పరిశీలన

చందానగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి డివిజన్ రాజీవ్ గృహకల్పలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తు గడువులోగా పనులు పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ భాస్కర్, వార్డు మెంబర్ శ్రీకళ, కుమారితో పాటు పలువురు పాల్గొన్నారు.

ఫ్లాట్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్

● కాలిపోయిన ఎలక్ట్రానిక్ పరికరాలు

మియాపూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఓ అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్‌లో విద్యుదాఘాతంతో ఏసీలో వచ్చిన మంటలతో ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయి. సకాలంలో పోలీసులు, ఫైర్ సిబ్బంది స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది. మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోకుల్‌ప్లాట్స్ రోడ్ నంబర్-3లోని ఎస్‌ఎస్ అపార్ట్‌మెంట్‌లో 104లో మోహన్‌దాసు, అతని భార్య ఇద్దరు రిటైర్డ్ కావడంతో ఇంట్లోలోనే ఉంటున్నారు. శనివారం ఏసీలో ఒక్కసారిగా మంటలు రావడంతో మోహన్ దాసు పోలీసులకు, ఫైర్ సిబ్బందికి ఫోన్ చేయడంతో వారు సకాలంలో స్పందించి విద్యుత్ నిలిపివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఇంట్లో ఉన్న ఏసీ, ఫ్రిజ్ ఎలక్ట్రానిక్స్ వస్తువులు కాలిపోయాయి.

నిరుపయోగంగా వీధి వ్యాపారుల షెడ్లు

● కోట్ల రూపాయల ప్రజాధనం వృథా

చందానగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అధికారుల అనాలోచిత చర్యలతో ప్రజాధనం వృథా కావడమే కాకుండా అసాంఘిక కార్యకలాపాలకు వీధి వ్యాపారుల షెడ్లు అడ్డాగా మారాయి. వారాంతపు సంతలతో ఏర్పడే చెత్తాచెదారం... ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా గత ప్రభుత్వ హయాంలో లక్షలు వెచ్చించి స్ట్రీట్ వెండర్స్ కోసం మోడల్ షెడ్లను నిర్మించి వారికి ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిల్ హుడా కాలనీ ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్ సమీపంలో సుమారు రూ.కోటి అంచనా వ్యయంతో వీధి వ్యాపారుల కోసం 100 షెడ్లను నిర్మించారు. నాలుగు సంవత్సరాల క్రితం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్‌తో కలిసి ప్రారంభించారు. ఇక్కడ వరకు బాగానే ఉంది. నిర్మించిన షెడ్లను స్ట్రీట్ వెండర్స్‌కి కేటాయించేందుకు నామమాత్రపు ఫీజుతో పలుమార్లు టెండర్లను ఆహ్వానించారు. కానీ ఎవరు ముందుకు రాలేదు. కారణం ఆ ప్రాంతంలో వ్యాపారం చేసేందుకు అనువుగా లేదని, కొనుగోలు చేసేందుకు ప్రజలు రారనే ఉద్దేశంతో వ్యాపారులు ముందుకు రాలేదు. దీంతో చందానగర్ ప్రాజెక్టు ఆఫీసర్ వీధి వ్యాపారులకు పలుమార్లు అవగాహన కల్పించినా అక్కడ అమ్మకాలు జరగవని ఎవరూ రాలేదు.



వీధి వ్యాపారుల కోసం నిర్మించిన షెడ్లు

లేదు. దీనికి ఆనుకుని చందానగర్ రైల్వేస్టేషన్ పక్కన వారాంతపు సంత జోరుగా జరుగుతుంది. వ్యాపారులు అక్కడే వ్యాపారం చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. ఇటీవల బదిలీపై వచ్చిన ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి వీటిని పరిశీలించి టెండర్లు ఆహ్వానించాలని నోటిఫికేషన్ కూడా విడుదల చేశారు. అయినా ఎవరు ముందుకు రాలేదు.

ప్రజలకు అందుబాటులో లేక

చందానగర్ ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్ సమీపంలో నిర్మించిన షెడ్లు పరిసర కాలనీల వాసులకు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఎవరు కొనుగోలు చేసేందుకు రారనే ఉద్దేశంతో వ్యాపారులు ముందుకు రాలేదు. దీంతో ప్రజాధనం వృథా అయ్యింది. ప్రజలకు అందుబాటులో నిర్మించి ఉంటే వ్యాపారులు కూడా ముందుకు వచ్చేవారని స్థానికులు, వ్యాపారులు చెబుతున్నారు. మొదటి సారి వ్యాపారులు టెండర్లలో వాటిని దక్కించుకున్నారు. అనుకున్నంత స్థాయిలో వ్యాపారాలు జరగకపోవడంతో వచ్చిన కొద్దిమంది వ్యాపారుల సైతం తిరిగి వెళ్లిపోయారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా

ప్రభుత్వం కోటి రూపాయాలు వెచ్చించి నిర్మించిన స్ట్రీట్ వెండర్స్ షెడ్లు నాలుగేళ్లుగా నిరుపయోగంగా మారడంతో మందుబాబులకు, అసాంఘిక కార్యకాలపాలకు అడ్డాగా మారాయి. సంచార జాతులకు చెందినవారు నివాస ప్రాంతంగా మార్చుకున్నారు. వీరు ఇక్కడ తిష్ట వేయడంతో రాత్రి సమయాల్లో రైల్వేస్టేషన్లకు వచ్చిపోయే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మందుబాబులు మద్యం తాగి గొడవలు పడుతుండటంతో మహిళలు రాకపోకలు సాగించేందుకు జంకుతున్నారు.

షెడ్లను అందుబాటులోకి తెస్తాం



గతంలో జీహెచ్‌ఎంసీ నిధులతో నిర్మించిన వీధి వ్యాపారుల షెడ్లు నిరూపయోగంగా ఉన్న విషయం మా దృష్టికి వచ్చింది. దీంతో ఇటీవల అధికారులతో కలిసి పరిశీలించాం. ఇక్కడ స్ట్రీట్ వెండర్స్ వ్యాపారాలు నిర్వహించేలా అవగాహన కల్పించి నామమాత్రం ఫీజుతో వారికి కేటాయించి ఉపయోగంలోకి తీసుకువచ్చేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటాం.

-మోహన్‌రెడ్డి, ఉప కమిషనర్

నంబర్‌ప్లేట్, రాంగ్ సైడ్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్

● ట్రాఫిక్ అధికారుల సమావేశంలో పలు నిర్ణయాలు



సమన్వయ సమావేశంలో సైబరాబాద్ జాయింట్ సీపీ ట్రాఫిక్ జోయల్ డేవిస్, తదితరులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై ఉన్న హాట్ స్పాట్‌లను గుర్తించి, ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని సైబరాబాద్ జాయింట్ సీపీ ట్రాఫిక్ జోయల్ డేవిస్ సూచించారు. గచ్చిబౌలి కమిషనరేట్‌లో శనివారం ట్రాఫిక్ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్, చలాన్లపై దృష్టి తదితర అంశాలపై చర్చించారు. ప్రమాదాలకు ప్రధాన కారణాలైన డ్రంకెన్ డ్రైవ్, రాంగ్ సైడ్ డ్రైవ్, నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్, హెల్మెట్‌లపై కూడా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. రోడ్లపై ఉన్న ఆక్రమణల తొలగింపు, రోడ్డు వెడల్పు చేయడం, జంక్షన్‌లలో డిజిటల్ బోర్డుల ఏర్పాటు, విద్యుత్ స్తంభాల తొలగింపు, పెండింగ్ చలాన్ల వసూళ్లు, ట్రాఫిక్ మార్షల్స్ వినియోగం, రద్దీ ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, అక్రమ పార్కింగ్‌పై చర్యలు తదితర అంశాలపై అనుసరించాల్సిన కార్యాచరణను రూపొందించారు. సమావేశంలో ట్రాఫిక్ డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్యూఈ సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న క్యూఈ నిపుణులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్వాలిటీ ఇంజినీరింగ్ (క్యూఈ)పై క్వాలిజీల్ సంస్థ మాదాపూర్‌లో నిర్వహిస్తున్న సదస్సు శనివారం ముగిసింది. 'ఏఐ శక్తితో కూడిన క్వాలిటీ ఇంజినీరింగ్-2025 ఆ తరువాత లక్ష్యం' నేపథ్యంతో నిర్వహించిన ఈ సదస్సులో 500 మందికి పైగా పరిశ్రమ నాయకులు, సీనియర్, మధ్య స్థాయి నిపుణులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగంలో రాణించడానికి అవసరమైన వ్యూహాలు, పరిజ్ఞానం, ఆచరణాత్మక సాధనాలను గురించాలని క్వాలిటీ ఇంజినీరింగ్ నిపుణులు వెల్లడించారు.

ఈ సందర్భంగా క్వాలిజీల్ కో-ఫౌండర్, సంస్థ ఇండియా ఆపరేషన్స్ హెడ్ మధుమూర్తి రోనాంకి మాట్లాడుతూ అత్యాధునిక ఏఐ సామర్థ్యాలతో సంక్లిష్టమైన, నాణ్యమైన ఇంజినీరింగ్ ప్రక్రియలను సులభతరం చేసేందుకు క్యుమెంటీస్ ఏఐను తాము విడుదల చేశామన్నారు. క్వాలిటీ ఇంజినీరింగ్ సామర్థ్యాలను ఇది గణనీయంగా మార్చే అవకాశముందంటూ, యూజర్ స్టోరీ జనరేషన్, బగ్ రిపోర్టింగ్ వంటి క్లిష్టమైన పనులను కూడా ఇది ఆటోమేట్ చేస్తుందన్నారు. క్యుమెంటీస్ ఏఐతో వాణిజ్య, ఆర్థిక, ఆరోగ్య సంరక్షణ, ఈ-కామర్స్ రంగాల నిర్దిష్ట అవసరాలు తీరతాయన్నారు.

పేదల ఆత్మగౌరవం అంబేడ్కర్ యూనివర్సిటీ

● 65 వ రోజుకు చేరిన ఉద్యోగుల నిరసన



వర్సిటీ పరిపాలన భవనం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ప్రొఫెసర్లు, ఉద్యోగులు, విద్యార్థులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పేదల ఆత్మగౌరవం అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయమని వర్సిటీ జేఏసీ చైర్‌పర్సన్ ప్రొ.పల్లవీ కాబడే, కన్వీనర్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్ అన్నారు. అంబేడ్కర్ వర్సిటీలో పది ఎకరాల స్థలం జవహర్ లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి (జేఎన్‌ఏఎఫ్‌ఏయూ) కేటాయించాలనే ప్రభుత్వ లేఖను ఉపసంహరించుకోవాలని జేఏసీ నేతలు, వర్సిటీ ఉద్యోగులు డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్ వర్సిటీలో ఐక్యకార్యాచరణ సమితి సభ్యులు, ఉద్యోగులు పరిపాలన భవనం ఎదుట అంబేడ్కర్ విగ్రహం దగ్గర బైఠాయించి, నల్లబ్యాడ్జీలు ధరించి శనివారం నిరసన వ్యక్తం చేశారు. కన్వీనర్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 27 న తలపెట్టిన వంట వార్పు కార్యక్రమానికి అందరూ సహకరించి ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తమకు సంఘీభావం తెలిపాలని కోరారు.

కార్యక్రమంలో విశ్వవిద్యాలయ మాజీ ఉద్యోగి శంకరాచార్య, డా.యకేశ్ దైద, డా.ఉదయని, కాంతం ప్రేమ్‌కుమార్, డా.రాఘవేంద్ర, పాండు, షబ్బీర్, రాములు, అధ్యాపక, అధ్యాపకేతర ఉద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగ సంఘాల నేతలు నిరసనలో పాల్గొన్నారు.

పెద్దపిల్లల్ని దత్తత తీసుకునేందుకు ముందుకు రావాలి

● కారా సీఈవో భావనా సక్సేనా



పెద్ద పిల్లల దత్తత పోస్టర్‌ను ఆవిష్కరించిన భావనా సక్సేనా తదితరులు.

యూసుఫ్‌గూడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పిల్లల్ని పెంచుకోవాలనుకునే తల్లిదండ్రులు చిన్న పిల్లల్నే కాకుండా పెద్దపిల్లల్ని కూడా చట్టబద్ధమైన విధంగా దత్తత తీసుకునేందుకు ముందుకు రావాలని సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ(సీఏఆర్‌ఏ) సీఈఓ భావనా సక్సేనా అన్నారు. శనివారం యూసుఫ్‌గూడ నిమ్స్‌మే ఆడిటోరియంలో తెలంగాణ ప్రభుత్వ ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ దత్తత మాసం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 'పెద్ద వయసు పిల్లల దత్తత' అనే అంశంపై ఆమె మాట్లాడారు. పిల్లల్ని పెంచుకోవాలనే తల్లిదండ్రుల్లో 95శాతం మంది 0-6 సంవత్సరాల లోపు చిన్నారులను దత్తత తీసుకునేందుకు ఇష్ట పడుతున్నారన్నారు. కానీ 6 నుంచి 13 సంవత్సరాలు, 13 నుంచి 19 సంవత్సరాల వారిని కూడా దత్తత తీసుకునే విధంగా అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఉద్యోగి బాధ్యతగా తీసుకుని దత్తత విధానాన్ని మరింత సరళతరమయ్యే విధంగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. వీధి బాలలను కూడా చట్టబద్ధ దత్తత విధానంలోకి తీసుకురావాలని ఆమె సూచించారు. రీజినల్ పాస్‌పోర్ట్ ఆఫీసర్ స్నేహజ జోన్నలగడ్డ మాట్లాడుతూ వేరే పిల్లల్ని దత్తత తీసుకుని పెంచటం అనేది ఎంతో ఉత్తమమైన కార్యక్రమం అన్నారు. దత్తత కోసం విదేశాల నుంచి కూడా ఎందరో వస్తున్నారని, అలాంటి సందర్భాల్లో పిల్లలకు పాస్‌పోర్ట్ అవసరం ఉంటుందని, వారికి వెంటనే పాస్‌పోర్ట్ ఇచ్చేందుకు మేము సిద్ధంగా ఉన్నామని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా 'పెద్ద వయసు పిల్లల దత్తత' పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

కార్యక్రమంలో ప్రభుత్వ కార్యదర్శి అనిత రామచంద్రన్, డైరెక్టర్ ఆఫ్ ఉమెన్ డెవలప్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ఎ.కాంతివెస్లీ, ఎస్‌సీసీసీఆర్ ప్రతినిధులు అపర్ణ, అంజనారావు తదితరులు పాల్గొన్నారు.

ఎనుముల అంటే.. అష్యూరెన్సు

కిసాన్ కాంగ్రెస్

హైదరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అధికారం కోల్పోయిన అసహనంలో సీఎం రేవంత్‌రెడ్డిపై హరీష్‌రావు ఏదేదో మాట్లాడుతున్నారని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి అన్నారు. ఎనుముల అంటే అష్యూరెన్సు అని, భట్టి అంటే బ్రాండ్ అని ఆయన గుర్తు పెట్టుకోవాలన్నారు. ఎనుముల రేవంత్‌రెడ్డి అంటే.. ఎగవేతల రేవంత్‌రెడ్డి అంటూ ఖమ్మంలో హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై ఈ మేరకు స్పందించారు. గాంధీ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కన్నా ఇప్పటికే 3 లక్షల టన్నులు అదనంగా పత్తి కొనుగోళ్లు జరిగాయని, 12 శాతం తేమ ఉన్నా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. సన్నరకం ధాన్యానికి వారం రోజులుగా బోనస్ వడుతున్నా.. పడట్లేదంటూ హరీష్‌రావు అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కృషి వల్లనే మత్స్యశాఖకు ఇన్‌ల్యాండ్ ఫిష్ స్టేట్ అవార్డు వచ్చిందని ఫిషర్మెన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు సాయికుమార్ అన్నారు.

టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షల షెడ్యూల్ విడుదల

కుషాయిగూడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ నిర్వహించే టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసింది. వివిధ గ్రేడ్‌లలో నిర్వహించే టైప్ రైటింగ్ పరీక్షలు జనవరి 18, 19వ తేదీలలో, షార్ట్ హ్యాండ్ పరీక్షలు 25వ తేదీన నిర్వహించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 కేంద్రాలలో టైప్ రైటింగ్, 6 కేంద్రాలలో షార్ట్ హ్యాండ్ పరీక్షలు నిర్వహిస్తామని సాంకేతిక విద్య, శిక్షణా మండలి కార్యదర్శి ఆకుటి పుల్లయ్య వెల్లడించారు. ఆయా పరీక్షల టైం టేబుల్‌ను కూడా సిద్ధం చేసి గుర్తింపు పొందిన ఇనిస్టిట్యూట్‌ల నిర్వాహకులకు సమాచారం అందజేశామని ఆయన పేర్కొన్నారు.

పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా డిసెంబరు 20వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని, మొదటి సారి టైప్, షార్ట్‌హ్యాండ్ పరీక్షలు రాసే అభ్యర్థులు ఏదైనా గుర్తింపు పొందిన ఇనిస్టిట్యూట్ నుంచి మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.



సత్యసాయిబాబా జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

ఘనంగా సత్యసాయి బాబా జయంతి

మియాపూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ డివిజన్ ప్రశాంత్‌నగర్‌లోని సత్యసాయి మందిర ప్రాంగణంలో సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం సత్యసాయి బాబా జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ముఖ్య అతిథులుగా హాజరై పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, నాయకులు వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్, గంగాధర్, ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



న్యాజ్‌లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా

న్యాజ్‌లో పాల్గొన్న కొమిరిశెట్టి సాయిబాబా

రాయదుర్గం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ నానక్‌రాంగూడలో శనివారం నిర్వహించిన న్యాజ్‌లో మాజీ కార్పొరేటర్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కొమిరిశెట్టి సాయిబాబా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఖాదర్‌ఖాన్ మక్ బూల్, తాహిర్, బురాన్, నారాయణ, నరేషసింగ్, అనిల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి చెక్కును అందజేస్తున్న కొండా విజయ్‌కుమార్

విద్యార్థికి హోప్ ఫౌండేషన్ చేయూత

చందానగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మదీనగూడలో ఓ ప్రైవేట్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థి ఫీజు చెల్లించకపోవడంతో పాఠశాలకు వెళ్లడం లేదు. విషయం తెలుసుకున్న లయన్స్‌క్లబ్, హోప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కొండా విజయ్‌కుమార్ విద్యార్థికి రూ. 20 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారికి తమవంతు సాయం అందించడంలో ముందుంటామని తెలిపారు. కార్యక్రమంలో బసిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, మల్లేశ్‌యాదవ్, భాస్కర్, రవీందర్, విష్ణు, భగవాన్, శ్రీను తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



విద్యార్థులు రూపొందించిన నమూనాలు తిలకిస్తున్న రఘునాథ్‌రెడ్డి

చందానగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో గుణాత్మకమైన పరిణితి పెంపొందించేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయని చందానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రఘునాథ్ రెడ్డి అన్నారు. చందానగర్ స్మార్ట్‌కిడ్స్ పాఠశాలలో శనివారం వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు రూపొందించిన నమూనాలు పరిశీలించి వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి ప్రదర్శనలు విద్యార్థుల ఆలోచన శక్తిని పెంచుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రియాంక గాంధీ చిత్ర పటానికి క్షీరాభిషేకం

హైదరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అత్యధిక మెజారిటీతో విజయం సాధించడంతో గాంధీభవన్‌లో శనివారం పార్టీ నేతలు సంబరాలు జరిపారు. పార్టీ సీనియర్ నేత వి.హన్మంతరావు ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా హన్మంతరావు మాట్లాడుతూ వయనాడ్‌లో 4 లక్షల మెజారిటీతో గెలిచిన ప్రియాంక గాంధీ ఇందిరాగాంధీ వారసురాలిగా చరిత్ర సృష్టించారన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా రాహుల్, ప్రియాంక తిరిగి.. కాంగ్రెస్ పార్టీని కేంద్రంలో అధికారంలోకి తీసుకువస్తారని ధీమా వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో గెలుపు మోదీ, అమిత్‌షాలది కాదని, అదానీ, అంబానీలదని అన్నారు.

ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
హరిబాబు : 99854 11086

సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న..
బాలయ్యనగర్ వైకుంఠధామం

- కరువైన కనీస వసతులు
- పట్టించుకోని అధికారులు
- ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం


బాలయ్యనగర్ శ్మశాన వాటిక

గాజులరామారం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైకుంఠధామాలను సుందరీకరణ చేసి, దహన సంస్కారాలకు ఇబ్బంది కలుగకుండా తీర్చిదిద్దిన అధికారులు, మరి కొన్నింటిని అలానే వదిలి వేశారు. దీంతో ఈ శ్మశాన వాటికల్లో పిచ్చి మొక్కలు పెరిగి, సర్పాలకు, కుక్కలకు నిలయంగా మారాయి. గాజులరామారం డివిజన్ బాలయ్యనగర్‌లో ఉన్న శ్మశాన వాటిక సమస్యలతో కొట్టుమిట్టులాడుతోంది.

ఈ బస్తీలో సుమారు 3 వేలమంది జనాభా నివసిస్తున్నారు. వీరి అవసరాల నిమిత్తం బస్తీని ఆనుకొని 3 ఎకరాల్లో శ్మశాన వాటిక ఉంది. కానీ దీని చుట్టూ ప్రహరీ, ఫెన్సింగ్, రోడ్డు, దహన సంస్కారాల తర్వాత దుస్తులను మార్చుకునేందుకు రూమ్‌లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బస్తీవాసులు అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు సమర్పించినా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కనీసం లోపలికి వెళ్లేందుకు సరైన దారి లేకపోవడంతో గతుకుల రోడ్డుపైనే వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందంటున్నారు.

అధికారులకు ఎప్పుడు ఫిర్యాదు చేసినా అభివృద్ధికి సంబంధించి ప్రణాళికలు తయారు చేస్తున్నామని మాట దాటవేస్తున్నారు. బడా బాబులు నివసించే ప్రాంతాల్లో మాత్రం వైకుంఠ ధామాలను అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన ప్రభుత్వం, పేదలు నివాసం ఉండే ప్రాంతంలో పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాలయ్యనగర్‌లోని శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రహరీ నిర్మించాలి



శ్మశాన వాటికలో పిచ్చి మొక్కలు మొలుస్తున్నాయి. వర్షాకాలం వచ్చిందంటే దహన సంస్కారాలకు ఇబ్బందిగా మారుతుంది. అధికారులు కల్పించుకొని, దీని చుట్టూ ప్రహరీని ఏర్పాటు చేయాలి. - పార్వతి, బాలయ్యబస్తీ

రూమ్‌లను ఏర్పాటు చేయాలి



ఎన్నో సంవత్సరాలుగా ఉన్న ఈ శ్మశాన వాటిక అభివృద్ధికి నోచుకోలేదు. లోపలికి వెళ్లడానికి రోడ్డు సరిగా లేదు. అక్కడికి వెళ్లిన వారు స్నానం చేసిన తర్వాత దుస్తులు మార్చుకునేందుకు రూమ్‌లు లేక ఇబ్బందులు పడుతున్నారు. - గంగారామ్, బాలయ్యబస్తీ

కాంగ్రెస్ విజయోత్సవ సన్నాహక సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి

దుండిగల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యేలా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన ప్రారంభించి మొదటి సంవత్సరం పూర్తయిన సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం హెచ్ఏఎల్ కాలనీ సిటీ ప్యాలెస్‌లో విజయోత్సవం సన్నాహక సమావేశాన్ని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాపాలనలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంక్షేమ పథకాలపై చర్చించి, సంక్షేమ పథకాలను ప్రజలకు ఎలా అందచేయాలో చర్చించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, టీపీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, మాజీ జెడ్పీ వైస్ ఛైర్మన్ బొంగునూరి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మి, నాయకులు, కార్యకర్తలు, ఎస్టీ,ఎస్సీ, మైనార్టీ ఎన్ఎస్‌యూఐ, ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

సర్వే సిబ్బందికి సహకరించాలి : కమిషనర్

పేట్‌బషీరాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన సమగ్ర కుటుంబ సర్వే కొంపల్లి మున్సిపల్ పరిధిలో చురుకుగా కొనసాగుతుంది. ఈ నెలాఖరు వరకు సర్వేను పూర్తిచేయాలని అధికారులు ఎన్యూమరేటర్లు, పర్యవేక్షకులకు సూచనలు ఇచ్చారు. ఈ నెల 6న మొదలైన సర్వేలో ఇంటింటికి తిరిగి స్టిక్కర్లను అతికించారు. మూడు రోజుల పాటు కార్యక్రమం పూర్తి చేయాల్సి ఉండగా కొన్ని వార్డుల్లో స్టిక్కరింగ్ ప్రక్రియ కొంత ఆలస్యంగా కొనసాగింది. కొంపల్లి మున్సిపల్ పరిధిలో 18 వార్డులు ఉన్నాయి. ఈ వార్డుల్లో మొత్తం 15 వేల 7 వందల 94 ఇళ్లు ఉండగా, ఇప్పటికే 12 వేల ఇళ్లలో సర్వే పూర్తిచేశారు. సర్వేలో 115 మంది ఎన్యూమరేటర్లు, 12 మంది సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. మిగిలిన 3 వేల 7 వందల 94 ఇళ్లు సర్వే చేయాల్సి ఉన్నాయి. రెండు రోజుల్లో పూర్తి చేస్తామని మున్సిపల్ కమిషనర్ శ్రీహరి తెలిపారు. ఈ సందర్భంగా సర్వేకు వచ్చే సిబ్బందికి సహకరించాలని కమిషనర్ కోరారు.


సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీహరి

మీ కోసం

కుత్బుల్లాపూర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ కుత్బుల్లాపూర్ సర్కిల్- 25 అధికారుల ఫోన్ నంబర్లు.

అడ్మినిస్ట్రేషన్
1. వి.నర్సింహ డిప్యూటీ కమిషనర్ 9989930159

ఇంజనీరింగ్
2. ఎల్.లక్ష్మీగణేష్, ఈఈ 9701365503
3. కె.రఘుపతిరెడ్డి డీఈఈ(ఎలక్ట్రికల్) 9121245035
4. ఏ.పాపమ్మ, డీఈఈ 7702203156
5. సాగర్, డీఈఈ 8008825040
6. రవీందర్, ఏఈ 7671924066
7. మల్లారెడ్డి, ఏఈ 7995020431
8. స్వాతి, ఏఈ 7331189482
9. అనురాగ్, ఏఈ 7331170020
10. మమత, ఏఈ(హెచ్‌డీ) 7337557259
11. ఎస్.సాయి యుగంధర్‌రెడ్డి ఏఈఈ 8328273100

టౌన్‌ప్లానింగ్
12. సురేందర్‌రెడ్డి, ఏసీపీ 9949994049
13. రమేష్, టీపీఎస్ 9440335544

ఎస్టాబ్లిష్‌మెంట్
14. సీహెచ్.కృష్ణ, ఏఎంసీ 8978901241
15. మంజులత, సూపరింటెండెంట్ 99989930670
16. రాజశేఖర్, జూనియర్ అసిస్టెంట్ 9849907698

ట్యాక్స్ విభాగం
17. ఎం.శ్రీనివాస్‌రెడ్డి సీనియర్ అసిస్టెంట్ 9000994024
18. పద్మభానురాజు, టీఐ 9390009099
19. ఆర్.గిరిబాబు సూపరింటెండెంట్ 9989930220
20. డి.బాలకృష్ణ, బిల్ కలెక్టర్ 8978190109
21. పి.ప్రభాకర్, బిల్ కలెక్టర్ 7337534676
22. జి.నవీన్‌కుమార్ బిల్ కలెక్టర్ 9398859035
23. ఎం.నారాయణ బిల్ కలెక్టర్ 8919786330
24. డి.సాయివిశాల్ బిల్ కలెక్టర్ 9989243304
25. ఎస్.సందీప్‌కుమార్ బిల్‌కలెక్టర్ 9000994020
26. యశ్వంత్, ఇన్‌వార్డు 9121467454
27. రఫత్, బిల్ కలెక్టర్ 9949390519
28. నిఖిల్‌రాజ్ మెహ్రా బిల్ కలెక్టర్ 9381850582

శానిటేషన్
29. డాక్టర్ కవిత ఏఎంఓహెచ్ 9154934130

మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలి


మూల మలుపుల వద్ద ప్రమాదకరంగా యూటర్న్ తీసుకుంటున్న వాహనాలు

గాజులరామారం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గాజులరామారం గ్రామ చౌరస్తా నుంచి మహదేవపురం చౌరస్తా వరకు మూల మలుపులు ప్రమాదకరంగా మారాయి. గతంలో ఇక్కడ అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. వాహనాల రద్దీకి తగ్గట్లుగా రోడ్డు వెడల్పు చేయలేదని, మూల మలుపుల దగ్గర ట్రాఫిక్ పోలీసులు సూచిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ద్వారకానగర్ కాలనీవాసులు తెలుపుతున్నారు. గతంలో ఈ మలుపుల వద్ద ఓ భారీ వాహనం విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో స్తంభం విరిగిపోయింది. దీంతో అప్రమత్తమైన అధికారులు విద్యుత్‌ను నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. ఇలాంటి సంఘటనలు అనేకం జరిగాయని మల్లారెడ్డినగర్ వాసులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూల మలుపుల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పేద విద్యార్థులకు ఫీజు చెల్లించిన కాంగ్రెస్ నాయకుడు

గాజులరామారం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు లేని పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు గాజులరామారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బుచ్చిరెడ్డి పరీక్ష ఫీజును చెల్లించారు. గాజులరామారం జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఫీజులు కట్టడానికి ఇబ్బందులు పడుతున్నారని, హెల్పింగ్ హార్ట్ సొసైటీ సభ్యులు ఆయన దృష్టికి తీసుకురాగా స్కూల్ ప్రధానోపాధ్యాయులు అశోక్‌రెడ్డికి పరీక్ష ఫీజు డబ్బులను చెల్లించారు. ఈ కార్యక్రమంలో సామాజికవేత్త మధుబాబు, మంజునాథ్ సింగే, సతీష్ యాదవ్, శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థుల ఫీజు చెల్లిస్తున్న బుచ్చిరెడ్డి

మెమెంటోలు అందజేసిన విద్యాధికారి


మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి విజయ కుమారి

దుండిగల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చర్చి గాగిల్లాపూర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో రెండు రోజుల పాటు జరిగిన సైన్స్ ఎగ్జిబిషన్ ముగింపు కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా విద్యాధికారి విజయ కుమారి హాజరై ప్రసంగించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మెజారిటీ ప్రభుత్వ పాఠశాలల నుంచి 280 సైన్స్ ప్రాజెక్టులు భాగమయ్యాయి. ఇందులో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు బహుమతులు, మెమెంటోలను విద్యాధికారి అందజేసి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల విద్యా శాఖాధికారులు, కుత్బుల్లాపూర్ ఎంఎల్ఓ రమేష్, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు భోజన ప్లేట్లు అందజేత

నిజాంపేట్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని ప్రధానోపాధ్యాయులు రఘునాథ్ అన్నారు. శనివారం నిజాంపేట్ మున్సిపాలిటీలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 6 వందల భోజన ప్లేట్లను కాశెట్టి సిద్దేశ్వర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి. విజయ్ భాస్కర్‌రెడ్డి, లక్ష్మయ్య, గౌరీశంకర్ విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు భోజనం ప్లేట్లను అందజేస్తున్న దాత, పక్కన ఉపాధ్యాయులు

దూలపల్లిలో 2కే రన్..

పేట్‌బషీరాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నేటి బాలలే రేపటి పౌరులని భాగ్యనగర్ క్షేత్ర సంఘటన మంత్రి విశ్వహిందూ పరిషత్ జి.సత్యం పేర్కొన్నారు. శనివారం దూలపల్లిలో ఏర్పాటు చేసిన 2కె రన్‌ను ఆయన ఎంఎల్ ఆర్‌టీ గ్రూప్స్ చైర్మన్ మర్రి లక్ష్మారెడ్డి, భాగ్యనగర్ క్షేత్ర భజరంగదళ్ సమయోజక సభ్యులు వీరప్ప స్వాములతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. దూలపల్లి శ్రీవేంకటేశ్వర ఆలయం నుంచి ప్రారంభమైన 2కె రన్ కొంపల్లి ఏఎంఆర్ గార్డెన్ వరకు కొనసాగింది. అనంతరం ఏఎంఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముందుగా భారతమాత, హనుమాన్, సీతారాముల చిత్రపటాలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ఉన్నత శిఖరాలను అధిగమించాలంటే చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సంస్థలు, స్కూల్ యాజమాన్యం, భజరంగదళ్ సభ్యులు పాల్గొన్నారు.



జెండాను ఊపి 2కె రన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యఅతిథులు

వ్యక్తిగత విషయాలను పంచుకోవాలి

దుండిగల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు ప్రపంచంలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎల్‌టీఐ మైండ్ ట్రీ అధ్యక్షులు సుధీర్ చతుర్వేది అన్నారు. బాచుపల్లిలోని వీఎన్ఆర్‌వీజేఐఎం 30వ స్నాతకోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చతుర్వేది మాట్లాడుతూ మనం ప్రస్తుతం భౌగోళిక, వాతావరణ, జనాభా, శక్తి సంక్షోభంలో ఉన్నామన్నారు. ప్రతి విషయంలో విద్యార్థులు వ్యక్తిగత విషయాలను పంచుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ స్నాతకోత్సవంలో డైరెక్టర్ భరత్ భూషణ్, వైస్ ప్రెసిడెంట్ రాజశేఖర్, జనరల్ సెక్రెటరీ దుర్గాప్రసాద్, మేనేజ్‌మెంట్ చైర్మన్ హరిశ్చంద్ర ప్రసాద్, పట్టభద్రులు, తల్లిదండ్రులు, కళాశాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షల షెడ్యూల్

కుషాయిగూడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసింది. వివిధ గ్రేడ్‌లలో నిర్వహించే టైప్ రైటింగ్ పరీక్షలు జనవరి 18, 19వ తేదీల్లో, షార్ట్‌హ్యాండ్ పరీక్షలు 25వ తేదీన నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 20 కేంద్రాలలో టైప్ రైటింగ్, 6 కేంద్రాలలో షార్ట్ హ్యాండ్ పరీక్షలు నిర్వహిస్తామని సాంకేతిక విద్య, శిక్షణా మండలి కార్యదర్శి ఆకుటి పుల్లయ్య వెల్లడించారు. ఆయా పరీక్షల టైం టేబుల్‌ను కూడా సిద్ధం చేసి గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్‌లకు సమాచారం అందజేశామని ఆయన పేర్కొన్నారు. కాగా, పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా డిసెంబరు 20 లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మొదటిసారి టైప్, షార్ట్‌హ్యాండ్ పరీక్షలు రాసే అభ్యర్థులు ఏదైనా గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్ నుంచి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బౌరంపేటలో పెద్దల జాతర..

హైదరాబాద్ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ సిటిజన్లను గౌరవిస్తూ నిర్వహిస్తున్న వేడుక పెద్దల జాతర (ఎల్డర్స్ ఫెస్ట్) 1వ ఎడిషన్ ఆదివారం బౌరంపేట శిఖర స్కూల్‌లో నిర్వహిస్తునట్లు 'వి ది వాలంటీర్స్' శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేడుకల్లో 30 వృద్ధాశ్రమాల నుంచి సుమారు 400 మంది వృద్ధులను ఒక్కచోటకు చేర్చుతుందన్నారు. సమాజం, సంరక్షణ స్ఫూర్తితో పాటు నవ్వులు, ఆకర్షణీయమైన పోటీలు, ఇతర ప్రదర్శనలుంటాయన్నారు. ఇంటరాక్టివ్ గేమ్‌లు, స్నేహపూర్వక పోటీలు, రంగోలి, కుండ పెయింటింగ్, కళాత్మక ప్రదర్శనలు, సీనియర్ సిటిజన్ల నృత్యాలు, సంగీతంతో కూడిన సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : ఎమ్మెల్సీ

దుండిగల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు కాలనీలు, బస్తీలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం సంక్షేమ సంఘాల నాయకులు శనివారం మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అభివృద్ధి పనులను చేపట్టాలని సూచించారు. అలాగే దుండిగల్ మున్సిపాలిటీ డీ.పోచంపల్లి, సురక్ష గ్రీన్ మేడోస్స్ కల్చరల్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యులంతా ఐక్యమత్యంగా ఉంటూ అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో నూతన కమిటీ సభ్యులు, అధ్యక్షులు వేణుగౌడ్, జనరల్ సెక్రటరీ శ్రీరాములు, ఉపాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ హేమంత్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, సాంబశివరావు, అమర్‌నాథ్, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన సురక్ష గ్రీన్ మేడోస్స్ నూతన కమిటీ

హత్యచేసి తప్పించుకు తిరుగుతున్న మహిళ అరెస్ట్

దుండిగల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నగల కోసం పథకం ప్రకారం మహిళను హత్య చేసి తప్పించుకు తిరుగుతున్న మహిళను దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

మేడ్చల్ జోన్ డీసీపీ ఎన్.కోటిరెడ్డి విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ నెల 14న ఉదయం 8 గంటల సమయంలో బహదూర్‌పల్లి కాకతీయ లేఅవుట్-2లో దాదాపు 40-45 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తు తెలియని మహిళ హత్యకు గురైందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల దర్యాప్తులో మృతురాలు నిజామాబాద్ జిల్లా, బాన్సువాడ ప్రాంతంలోని సంగమేశ్వరకాలనీకి చెందిన నాగయ్య భార్య అంజమ్మ(44)గా గుర్తించారు. అదే ప్రాంతానికి చెందిన పాత నేరస్తురాలు బూసిబోయిన గంగామణి(40) ఒక పథకం ప్రకారం బంగారు నగలు, సిల్వర్ వస్తువులను దొంగిలించడానికి అంజమ్మను బహదూర్‌పల్లి ప్రాంతంలోని తమ బంధువుల ఇంటికి వెళ్లివద్దామని తీసుకువచ్చింది.

అనంతరం కాకతీయ లేవుట్‌లో హత్యచేసి, నగలు దొంగిలించి పారిపోయింది. కేసునమోదు చేసిన పోలీసులు నిందితురాలిని సీసీ టీవీ, ఆర్టీసీ జీరో బస్ టిక్కెట్ ఆధారంగా గుర్తించి శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ పీ.సతీష్, డీఐ.బి.సతీష్ పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


మృతి చెందిన వ్యక్తి

పేట్‌బషీరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దూలపల్లిలో శ్రీవాణి స్కూల్ కల్వర్టు సమీపంలో సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయసు గల వ్యక్తి మృతి చెంది ఉండగా గమనించిన స్థానికులు పేట్‌బషీరాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసుకుని, మృత దేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుని మెడలో నల్లపూసల దారం, కుడి చేతికి కమ్మ ధరించి ఉన్నాడు. అతని ఛాతీపై శిరీషా, అమ్మ, నాన్న పేర్లతో పచ్చబొట్లు, మెరూన్ కలర్ టీ షర్టు, గోధుమ రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. వివరాలు తెలిస్తే 8712568129, 8712663248 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

శాంతి సమావేశం

జగద్గిరిగుట్టలో వివిధ కాలనీల పెద్దలతో శనివారం నిర్వహించిన శాంతి సమావేశంలో మాట్లాడుతున్న బాలానగర్ ఏసీపీ హన్మంతరావు, పాల్గొన్న జగద్గిరిగుట్ట సీఐ నర్సింహ, డీఐ అంజయ్య, వివిధ కాలనీల పెద్దలు.

- జీడిమెట్ల(ఆంధ్రజ్యోతి)



జీవితంపై విరక్తి చెంది గృహిణి ఆత్మహత్య

పేట్‌బషీరాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్ల గ్రామం సమీపంలో స్ప్రింగ్‌ఫీల్డ్ కాలనీలో పుణ్యా రెసిడెన్సీలో నివసిస్తున్న రాజారపు పార్వతి(39), లక్ష్మయ్యలు భార్య భర్తలు. గత కొంతకాలంగా ఈమె అనారోగ్యంతో బాధపడుతోంది. అంతేకాక మూడు సంవత్సరాల క్రితం బట్టలు ఉతుకుతుండగా కిందపడటంతో కుడికాలు విరిగిపోయింది. ఆమె భర్తకు కూడా అనారోగ్యమే. జీవితంపై విరక్తి చెందిన పార్వతి 22వ తేది సాయంత్రం 4 గంటలకు ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించి, దర్యాప్తు చేస్తున్నారు.





ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | పున్నారావు: 9985921366